-కాకాని కమల



# శిథిలశిల్పం

సాయంత్రం -

**చల్లగాలి తిరిగింది. పెరట్లో వేపచెట్టు కింద నవారు మంచంలో కూర్చుంది సత్తెమ్మ. ఇంట్లో ఆ మూల మీది గదిలో పగలు రాత్రి దగ్గి దగ్గి యాస్త వచ్చింది. సరిగ్గా అరగంట క్రితమే కొడుకులిద్దరూ సత్తెమ్మని నవారు మంచంతో సహా ఎత్తి తెచ్చి పెరట్లో వేపచెట్టు కింద పడుకోబెట్టారు. పక్షవాతం వచ్చి కాలు చెయ్యా చచ్చుపడ్డాక సత్తెమ్మకి పొద్దు గడవటం కష్టంగా ఉంది. ఇంటి నిండా జనం ఉన్నారు. కొడుకులు కోడళ్లు మనవలు... పనివాళ్ళు... అయితే ఏం? ఎవరి పన్లు వాళ్లవి.**

'ఎంత కాలం ఈ పక్షవాతపు ముసలిదాన్ని కనిపెట్టుకుని ఉంటారు?' తనలో తనే సణుక్కొంది సత్తెమ్మ.

దిండు మీద దిండు పెట్టి వెళ్ళాడు కొడుకు.

పడుకున్నదల్లా నెమ్మదిగా లేచి దిండుకు ఆనుకుని కూర్చుంది.

కూలిన పిట్టగోడ మీంచి ఎదురింటి గంగరాజు లోగిలి మొత్తం కనిపిస్తుంది.

వాళ్ల పాలెగాడు నారాయుడు నల్లకోడి ఈకలు పీకుతున్నాడు.

'గంగరాజు ఇంటికి చుట్టాలు వచ్చినట్టున్నారు' అనుకుంది సత్తెమ్మ.

పాలెగాడు నారాయుడి చేతిలో బలిసిన నల్లకోడిని చూస్తుంటే సత్తెమ్మకి నోట్లో నీళ్లు ఊరుతున్నాయి. 'రేత్తిరికి నల్లకోడితో పలావు చేసి అతిథులకు వడ్డిత్తారు కాబోలు. అదీకాక గంగరాజు అల్లుడుగాని వచ్చాడేమో' అనుకుంది చేతికి ఉన్న వెండి మురుగులకేసి చూసుకుంటూ. తన గత వైభవం కళ్ల ముందు కదిలింది సత్తెమ్మకి.

మగడు బతికున్న రోజుల్లో ఓ వెలుగు వెలిగింది సత్తెమ్మ. ఆ రోజుల్లో పాతికెకరాల పొలం, పాడి పంట, పాలెగాళ్లు, వచ్చిపోయే బందుగులు... ఇల్లు నిత్తె కళ్యాణంలాగుండేది.

చేపల ఇగురో చేపల పులుసో కోడో లేక గుడ్డో లేకుండా ముద్ద ఎత్తేవాడు కాదు సత్తెమ్మ మగడు గోవిందరాజులు.

ఎర్రగా దాలి మీద కాగిన మీగడ పెరుగు, వెన్న కాచిన నెయ్యి, గుమ్మడి వడియం నూల అరిసో సున్ని వుండో... నిత్యం పండుగ భోజనమే. అతిథులు వస్తే 'కూర' లేకుండా భోజనం పెట్టేవాడు కాదు. బందుగులు తెగ మెచ్చుకునేవారు. అందునా సత్తెమ్మ వంటి మహారాణి.

కాని క్రమంగా ఆ వైభవం తరిగిపోయింది. తరచూ కరువులు, తుఫానులు, పంట నష్టం అయింది. భూములు సరిగా పండక పోవటం, చీడపీడలు, ఆడపిల్లల పెళ్లిళ్లు... ఖర్చులు తట్టుకోలేక ఒకటొకటిగా పొలాలు అమ్మాల్సి వచ్చింది. గోవిందరాజులు చనిపొయ్యాక ఆ ఇంటి కళ తప్పింది. పసుపు కుంకం పోయిన సత్తెమ్మ ముఖంలో వన్నె తగ్గింది. కొడుకు కోడళ్ళ హయాం వచ్చేసరికి తిండి గడవడమే కష్టంగా తయారయింది. సత్తెమ్మకి పక్షవాతం కమ్మి కాలు చెయ్యా చచ్చుపడ్డాయి. భర్తతోపాటే సత్తెమ్మ అజమాయిషీ పోయింది. కొడుకులు కోడళ్ల పెత్తనం వచ్చింది. వాళ్లు ఏది పెడితే అది తినటం, ఆ మూల గదిలో మంచంలో ముణగ దీసుకోవటం.

'అయ్యో తల్లి, పెద్దది, అనుభవజ్ఞురాలు, సలహా అడుగుదాం' అని కొడుకులకే లేదు. ఇంక కోడళ్లకి ఏం ఉంటుంది? ఏదన్నా నోరు తెరిచి పెద్దరికంగా చెప్పబోయినా 'నీకెందుకు ముసిల్దానా నోరు మూసుకో' అంటున్నారు కొడుకులే. ఇంక కోడళ్ళ సంగతి చెప్పేదేముంది?

చెయ్యా కాలు అంటే చచ్చుబడ్డాయి గాని సత్తెమ్మకి నోరు చచ్చుపడలేదు. జిహ్వ చావలేదు. అందుకే కోడిరుచి జ్ఞాపకం వస్తే నోట్లో నీళ్లు ఊరుతున్నాయ్.

'మేమే... మే... హహా....' సత్తెమ్మ ఆలోచన్లు కట్టిపెట్టి తలెత్తింది.

ఎదురింటి గంరాజు ఇంకో పాలెగాడు చిన్న మేకపిల్లని తెచ్చి అరుగు వారగా రాటకి కదుతున్నాడు.

సత్తెమ్మ ఆశ్చర్యపోయింది. 'ఏంటి? వాళ్ళింట్లో ఏదన్నా శుభ కార్యమా? ఓ పక్క కోడిని కోస్తున్నారు. మరోప్రక్క మేకని తెచ్చారు. వాళ్ల పెద్ద మనవడికి గాని పుట్టుపంచెలా?' అనుకుంది సత్తెమ్మ. ఎదురుగా అరుగు వారగా అరుస్తున్న చిన్న మేకపిల్లని చూస్తుంటే లేత కొబ్బరి గుర్తుకి వచ్చింది. లేత మేక మాంసం మహారుచిగా ఉంటుంది. పొయ్యి మీద పెడితే వెన్నలా ఉడికిపోతుంది. సరిగ్గా మషాళా పాళ్లు వేసి వండితే... సత్తెమ్మ బొక్కినోటి నిండా నీళ్లు వచ్చాయి. జిహ్వ చిప్పిల్లింది. నోరు తెరిచి కోడళ్లని ఏదన్నా చేసి పెట్టమని అడిగితే, మూతి మూడు వంకర్లు తిప్పుతారు. 'ఇప్పుడే నీకు చాకిరి చెయ్యలేక ఛస్తున్నాం. శాకాలు తింటేనే తిన్నది అరక్క బేదులు వాంతులు నీకు. ఇంక కోళ్లు మేకలు రుచులు తిన్నవంటే వోత రోగం తిరగబెట్టి మంచంలోనే అన్ని కానిస్తే ఎవురు ఆ ఛండాలం కడగాలి? ఇప్పటికే పనిమనిషి సణుగుతూంది' అంటారు. నోరు చెఱుగుతారు.

ఆ మాటలు, ఎత్తిపొడుపులు వింటే చప్పి తిండి కూడా సయించదు. ఇగ కొడుకులు తనని బతికున్న మడిసిగా గ్యాపకం పెట్టి శానా రోజులు అయ్యింది. ఇప్పుడు వాళ్లు తన కొడుకులు కాదు. తన కోడళ్లకి మొగుళ్లు. అందుకే నోరు మూసుకుంది. చక్రవర్తి లాంటి మగనితోనే పోయింది సౌభాగ్యం.

'అమ్మా...'

'అమ్మా...'

'ఆ...'

'అమ్మా లెగవే. ఇంట్లకి పోదాం. చీకటయ్యింది' కొడుకు అదిలిస్తుంటే నీళ్లు నిండిన కళ్లని తెరిచి రెప్పలు విదిలించింది. నిజమే. వెలుతురు మలిగి చీకట్లు ముసురుకుంటున్నాయి. చల్లగాలి కూడా ఎక్కువయింది.

'ఉరేయ్... నాకేం గాదుగాని ఇంకాస్సేపు ఈడనే కూసుంటారా? ఆ మూల గదిలో వాసిన. ఒకట చీకటి గూభ్యెం' అంది.

'ఆ గెదికి వాసిన నీ నుంచి వచ్చిందే గదే నాన్నమ్మ. అందుకే నువ పిలిసినా నీ గెదికి నేను రాంది' మనవడు వెక్కిరించాడు.

'అనుండ్రా అనుండ్రి' మనసులోనే సణుక్కుంది సత్తెమ్మ. 'నీ ఇష్టమే అమ్మా. మళ్లీ సల్లగాలికి ఏ రొంపన్న చేస్తుంది నీకు'

